



టిసి వరుణ్



పూల నాగరాజు

మరో ఇద్దరికి నామినేటెడ్ పదవులు

అహుడా ఛైర్మన్‌గా టిసి వరుణ్

ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండో జాబితాను విడుదల చేసింది. ఈ మేరకు శనివారం విడుదల చేసిన రెండో జాబితాలో అనంతపురం జిల్లా నుంచి ఇద్దరికి పదవులు దక్కాయి. అందులో జనసేన నుంచి ఒకరికికాగా, టిడిపి నుంచి ఒకరికి పదవి దక్కింది.

అహుడా ఛైర్మన్‌గా టిసి వరుణ్

అనంతపురం–హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (అహుడా) ఛైర్మన్‌గా టిసి వరుణ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన నాయకుడిగానున్న టిసి వరుణ్ ముందు నుంచి చిరంజీవి, పవన్‌కళ్యాణ్ కుటుంబానికి విధేయులుగా ఉంటూ వస్తున్నారు. 2009లో ప్రజారాజ్యాం పార్టీ పెట్టిన సమయం నుంచి వారి వెంటే ఉంటూ వస్తున్నారు. 2019లోనూ జనసేన తరుపున టిసి వరుణ్ అనంతపురం అర్బన్ అసెంబ్లికి పోటీ చేసి ఓటమి చెందారు. గత ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా అనంతపురం అర్బన్ స్థానం టిడిపికి ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆయనకు అహుడా ఛైర్మన్ పదవిని జనసేన కోటాలో ఇచ్చారు. అంతక మునుపు అహుడా ఛైర్మన్‌గా మహాలక్ష్మి శ్రీనివాసులు ఉండేవారు. వైసిపి ఓటమి తరువాత ఆ పార్టీ నాయకులందరూ పదవుల నుంచి తప్పుకున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక నియమించిన నామినేటెడ్ పోస్టుల్లో టిసి వరుణ్‌కు అహుడా ఛైర్మన్ పదవి దక్కింది.

ఆర్టీసీ రిజనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు

తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పూల నాగరాజును ఆర్టీసీ రిజనల్ ఛైర్మన్‌గా నియమించారు. 2018లో జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పూల నాగరాజు పనిచేశారు. ఆయన ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ప్రయత్నించారు. అయినా అవకాశం లభించలేదు. ఇప్పుడు ఆయనకు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పదవిని ప్రభుత్వం కేటాయించింది.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

'ప్రజాపోరు'లో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు



ప్రజాపోరులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు జి. ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి ప్రజలను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం నగర న్యూ కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ పరిధిలోని చిన్మయ నగర్, రామకృష్ణ కాలనీ, జెఎన్‌టియు మెయిన్ రోడ్‌లో సిపిఎం ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్లక్ష్య పరిపాలన వల్ల నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫలం చెందిందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, క్రూడాయిల్ ధరలు అంతర్జాతీయంగా తగ్గినప్పటికీ దేశంలో పెట్రోల్ డీజిల్ రేట్లు తగ్గలేదన్నారు. నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందన్నారు. వీటిని పక్కదారి పట్టించడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జమిలి ఎన్నికలనే కొత్త పేరుతో దేశంలోని ప్రజలను మోసం చేయడానికి ఎత్తుగడ వేస్తోందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో జమిలి ఎన్నికలు ఒకే దేశం ఒకే ఎన్నిక అనేది సాధ్యం కాని అంశం అని అన్నారు. వెంటనే అలాంటి విధానాలు ఉపసంహరించాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచిందనివిమర్శించారు. ఎన్నికల్లో విద్యుత్ భారాలు వేయబోమని చెప్పి ఇప్పుడు ట్రూ అప్ ఛార్జీల పేరుతో దాదాపు రూ.12 వేల కోట్ల పైబడి ప్రజల మీద భారం వేయడానికి సిద్ధమైందన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్నిఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను నివారించాలన్నారు. ఇసుకను ఉచితంగా ఇవ్వడాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, నగర కార్యవర్గ సభ్యులు ముర్తుజా, ఇర్ఫాన్, ఏటీఎం నాగరాజు, మహిళా సంఘం నాయకురాలు చంద్రిక, కాలనీ కమిటీ సభ్యులు శంకర్, నల్లప్ప, ప్రసాద్, ప్రమీల, సిద్ధూ, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా పోరుయాత్ర

సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం ప్రజా పోరుయాత్ర శనివారం 49వ డివిజన్‌లోని ఇందిరాగాంధీ నగర్, ముత్యాలమ్మ కాలనీ, ఆర్‌కె.నాగర్, ఎస్సీ కాలనీ, సిపిఎం కాలనీ, గౌరవ్‌గార్డెన్స్‌లో నిర్వహించారు. నాయకులు కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు వి.సావిత్రి, నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలపై భారాలు మోపుతోందని మండిపడ్డారు. వివిధ రూపాల్లో దొడ్డిదారిన భారాలు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తోందని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ధరలను అరికట్టడంలో విఫలం చెందాయని విమర్శించారు. నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో జాప్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. మహిళలు, ఆడ పిల్లలు, దళితులపై నిత్యం అత్యాచారాలు జరుగుతున్న ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టడం లేదన్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల నుండి డబ్బులు గుంజడానికి ప్రయత్నిస్తుందనివివరించారు. ఇందిరా నగర్ నుండి హెచ్ ఎల్ సి కాలనీ పోవు బ్రిడ్జి సైడ్ వాల్ మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, నగర నాయకులు నూరుల్లా, మసూద్, ఎన్టీఆర్ సీన, వెంకటేష్, ప్రసాద్, డేవిడ్ పాల రాము, మాబాషా, ఐద్వా నాయకురాలు చంద్రిక, పర్యాది, సునంద, రేణుక, శాఖ సభ్యులు ఇస్మాయిల్, చాంద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపోరులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకురాలు సావిత్రి

శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను శిక్షించొద్దు

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వివిధ రకాల శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం సరికాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య అన్నారు. శనివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు ఆపార్ ఐడీలు సృష్టించమని ఒక వైపు ఒత్తిడి తీసుకువస్తూనే, ఆధార్ అప్‌డేట్ చేయించమని, పదవ తరగతి విద్యార్థులకు నామినల్ రోల్స్ తయారు చేయమని, ఎఫ్‌ఏ–2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. నవంబర్ 14వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ జరపాలని, పూటకొకమారు ఆపార్ అప్‌డేట్ తెలుపమనడం, రోజుకొక్కసారి వెబెక్స్ మీటింగులు జరుపుతూ ఒత్తిడికి గురి చేయడం సరికాదని అన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడితో కూడిన కార్యక్రమాలకు దూరం చేయాలని, ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన కొనసాగే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇదే నిరంకుశ వైఖరి కొనసాగిస్తే భవిష్యత్తులో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ అనేక రకాలైన యాప్‌ల ద్వారా బోధనేతర పనులు అప్పగిస్తూ, జీవో నెంబర్ 117ను అమలుపరిచి ప్రభుత్వ విద్యారంగాన్ని పతనం వైపు తీసుకెళ్లిందని విమర్శించారు. గత ప్రభుత్వ తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప, సరళ, గౌరవాధ్యక్షులు రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శులు ప్రమీల, రఘురామయ్య, అబ్దుల్ వహాబ్, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

సెలవురోజుల్లో పాఠశాల నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు



కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులకు రెండవ శనివారం సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహించి మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్న ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు డిమాండ్ చేశారు. నగరంలో సెలవు రోజు తరగతులు నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలకు ఎస్ఎఫ్ఐ నాయకులు చేరుకుని అడ్డుకున్నారు. పాఠశాల నిర్వాహకులను ఎస్ఎఫ్ఐ నేతలు ప్రశ్నించారు. అక్కడే నిరసన చేపట్టారు. సెలవు రోజుల్లో ఆటలు పాటల నిర్వహిస్తామంటూ బయటకు చెబుతూ ఎలాంటి గేమ్స్ నిర్వహించకుండా తరగతులు నిర్వహించి మానసిక ఒత్తిడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిత్యం చదువులు, ర్యాంకులంటూ వారిపై ఒత్తిడి పెంచడంతో కొందరు విద్యార్థులు తీవ్ర ఆందోళనలకు గురువుతూ ఆత్మహత్య చేసుకుంటున్న సంఘటనలు జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. విద్యా శాఖ అధికారులు కూడా పర్యవేక్షణ చేయకపోవడంతోనే కార్పొరేట్ విద్యా సంస్థలు పిల్లల కోసమే అదనపు తరగతులంటూ తల్లి తండ్రులను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. ఇది విద్యా విధానం నిబంధనలకు విరుద్ధం అన్నారు. తక్షణమే సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల నిర్వాహకులు విద్యార్థులను ఇంటికి పంపించడంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సోము తదితరులు పాల్గొన్నారు.

సాయి వినాయక డ్రిప్ యాజమాన్యంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్



ఆసుపత్రిలో ఓబులేసును పరామర్శిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

దళిత డ్రైవర్ సాకే ఓబులేసుపై దాడి చేసి గాయపరిచిన సాయి వినాయక డ్రిప్ ఏజెన్సీ యజమానులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, అనంతపురం రూరల్ మండల అధ్యక్షులు జీవరత్నం డిమాండ్ చేశారు. సాయి వినాయక డ్రిప్ యాజమాన్యం దాడిలో గాయపడిన డ్రైవర్ ఓబులేసు సర్వజనాసుపత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న కెవిపిఎస్ నాయకులు శనివారం ఆసుపత్రికి వెళ్లి డ్రైవర్ ఓబులేసును పరామర్శించి జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జీవరత్నం మాట్లాడుతూ కంబదూరు మండలం, తిప్పేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ సాకే ఓబులేసు దళితుడని, అనంతపురం పట్టణ సమీపంలోని సాయి వినాయక డ్రిప్ ఏజెన్సీ యజమానుల వద్దకు డ్రిప్పు పైపుల కోసం రైతు నాగరాజును పైపులు కొనడానికి ఓబులేసు తీసుకొని వెళ్లడం జరిగిందని అన్నారు. పైపులు రేటు విషయంలో సాకే ఓబులేసు 'చూసుకొని రేటు వేయండి చాలా సార్లు మీ దగ్గరికి వస్తున్నా' అని విజ్ఞప్తి చేశాడన్నారు. దీనికి సాయి వినాయక ఏజెన్సీ యజమానులు 'నువ్వు డ్రైవర్, డ్రైవర్ గా ఉండు మాదిగ పంచాయతీ కాద'ంటూ కులాన్ని ఎత్తి దూషించారన్నారు. ఈ వాఖ్యలను ఓబులేసు ప్రశ్నించినందుకు టేబుల్ మీద ఉన్న గాజు పలక పేపర్ వెయిట్‌ను డ్రైవరు ఓబులేసు తలపైకి విసిరి గాయపరిచారని తెలిపారు. తీవ్ర గాయాలైన సాకే ఓబులేసు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వెళ్లడంతో డాక్టర్లు ఓబులేసు తలకు 12 కుట్లు వేశారని తెలిపారు. దళిత ఓబులేసుపై దాడి చేసిన యాజమాన్యంపై అట్రాసిటి కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నగర అధ్యక్షులు అక్కులప్ప, నాగేంద్ర పాల్గొన్నారు.

'పిఎం సూర్యఘర్' అమలులో 'అనంత'ను ప్రథమ స్థానంలో నిలబెడదాం

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



సోలార్ రూఫ్ టాప్ కౌంటర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో అనంతపురం జిల్లాను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెడదామనికలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం నగరంలోని జెఎన్టీయు రోడ్‌లో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ప్రధానమంత్రి సూర్యఘర్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లి యోజన ఎంతో మంచి పథకం అని అన్నారు. దీని ద్వారా రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాఫ్ నిర్మించుకుని విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చన్నారు. అనంతపురం జిల్లాలో వర్షపాతం, మేఘాలు తక్కువని, ఎండ విపరీతంగా ఉంటుందని చెప్పారు. ఈ పథకం జిల్లాలో విజయవంతం అవుతుందని అన్నారు. ఆగస్టు 6వ తేదీన జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పథకం గురించి చెప్పారన్నారు. జిల్లాలో సోలార్ శక్తిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో రాష్ట్రంలోనే జిల్లాను మొట్టమొదటి స్థానంలో నిలపాలని, దేశంలో కూడా నెంబర్ వన్ స్థానంలో నిలబట్టేందుకు కృషి చేయాలని అన్నారు. అధికారులు, బ్యాంకర్లు, విద్యుత్తు వినియోగదారులు ఈ పథకం అమలులో ఎంత ముఖ్యమని అన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరి ఇళ్లలో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని, ఇందుకు ప్రతి ఒక్కరికి అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో క్యాంపెయిన్ మోడ్ లో ఈ పథకాన్ని సంపూర్ణంగా చేపట్టాలన్నారు. జిల్లాకు పవర్ గ్రిడ్, సోలార్ పార్కులు రాబోతున్నాయన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన సోలార్ రూఫ్ టాప్ కౌంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, ట్రాన్స్‌కో ఎస్ఈ వరప్రసాద్, ఈఈలు జేవి రమేష్, రాజశేఖర్, శేషాద్రి శేఖర్, ప్రసాద్, బ్యాంకర్లు, విద్యుత్, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జెఎన్‌టియు అభివృద్ధికి సహకారం అందిస్తాం

రక్షణ మంత్రి మాజీ సలహాదారు డాక్టర్ జి. సతీష్ రెడ్డి



సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ, తదితరులు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ, ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని ముఖ్యంగా రీసెర్చ్ ప్రాజెక్టులు, కాన్ఫరెన్సులు నిర్వహించడానికి డిఆర్‌డిఒ నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని భారత రక్షణ మంత్రి మాజీ సలహా దారులు, మాజీ డిఆర్‌డిఒ ఛైర్మెన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం జెఎన్‌టియు పూర్వ విద్యార్థి యిన డాక్టర్ జి. సతీష్ రెడ్డి ఇన్‌ఛార్జి వీసీ హెచ్. సుదర్శనరావు , వీసీ ఒఎస్‌డి ఎన్. దేవన్న , రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్యను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.సతీష్ రెడ్డిని సన్మానించారు. అంతకు ముందు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ జెఎన్‌టియు పూర్వవిద్యార్థిగా ఇక్కడి విద్యార్థులకు, అధ్యాపకులకు రీసెర్చ్ ప్రాజెక్టులు ఇచ్చేందుకు, వర్సిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. లేజర్స్, ఇమేజ్ ప్రాసెసింగ్ (ఇమేజ్ ప్రాసెసింగ్), సైబర్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) వంటి అంశాలపై ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సెక్రటరేట్ (డి ఆర్ డి ఓ) నుంచి ఎలాంటి సహకారమైన తమ ద్వారా ఉంటుందని చెప్పారు. అనంతరం వీసీ మాట్లాడుతూ వర్సిటి అభివృద్ధికి పూర్వవిద్యార్థి డాక్టర్ జి. సతీష్ రెడ్డి తోడ్పాటును అందిస్తామని చెప్పడం హర్షనీయమనిరీసెర్చ్ ప్రాజెక్ట్ రావడానికి ఆయన సలహాలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య యస్.వి. సత్యనారాయణ, అల్యూమిని డైరెక్టర్ పి. సుజాత, కిరణ్మయి, జివి. సుబ్బారెడ్డి, సురేష్ బాబు, వైశాలి ఘోర్పడే, పిఆర్. భానుమూర్తి, జి.ప్రశాంతి, పద్మసువర్ణ, బి.ఈశ్వర్ రెడ్డి, శివకుమార్ , కో ఆర్డినేటర్లు డాక్టర్ అరుణ మస్తాని, కె.అరుణ, ఎస్. శారద, కళాశాల ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. వసుంధర తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆపన్నహస్తమందేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యానికి అన్నదాత తీవ్రంగా నష్టపోయాడు. కీలకమైన జూన్, ఆగస్టు మాసాల్లో వర్షాభావంతో నష్టపోగా, తరువాత అక్టోబరు మాసంలో కురిసిన అధిక వర్షాలకు మరో విధంగా నష్టపోయారు. రెండు విధాలుగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే సీజన్ మొత్తంగా చూసినప్పుడు వర్షపాతం సాధారణం కంటే మెరుగ్గా పడినట్టు కనిపిస్తోంది. దీంతో కరువు మండలాల ప్రకటనలో కొన్నింటికే చోటు లభించింది. చాలా మండలాలు కరువు మండలాల నుంచి మినహాయించబడ్డాయి. దీంతో ఆ మండలాల్లో వర్షాభావంతో నష్టపోయిన రైతుకు ఏ మేరకు సాయం అందుతున్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలున్నాయి. ఇందులో 17 మండలాలనే రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. తక్కిన మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చలేదు. దీంతో ఆ మండలాల్లో నష్టపోయిన రైతుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు కీలకమైన ఆగస్టు నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నాయి. దీని మూలంగా ఖరీఫ్ ప్రధాన పంటల సాగు 20 శాతంలోపే అయిందని చెబుతున్నాయి. వేసిన పంట కూడా ఆ కాలంలో వర్షాల్లేక దెబ్బతింది. ఈనేపథ్యంలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఈ వారంలో జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలోనూ తీర్మానం చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై ఏ మేరకు స్పందిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఇకపోతే వచ్చే వారంలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. తొలిసారిగా జిల్లాకు నుంచి ఆర్థికమంత్రిగా వ్యవహరిస్తున్న పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఏ రకమైన ప్రాధాన్యతను కల్పిస్తారన్నది సర్వత్రా సాగుతున్న చర్చ. ప్రధానంగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనివ్వాలని సిపిఎం గత కొన్ని రోజులుగా పోరాటాన్ని కొనసాగిస్తోంది. అంతక మునుపు వారంలో ఈ అంశంపై బస్సు యాత్ర చేపట్టగా, ఈ వారంలో ప్రజాప్రతినిధులందరినీ కలసి విజ్ఞాపన పత్రాలను అందజేశారు. సోమవారం నాడుప్రవేశపెట్టే బడ్జెట్‌లో జిల్లా సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తారా లేదా అన్నది తేలనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీని ప్రారంభించింది. అయితే అర్హుల జాబితాలపై లబ్దిదారుల్లో ఇంకా అమోయమయం, సందిగ్ధత నెలకొంది. ఎవరికి వస్తుందో..ఎవరికి రాదోనన్న సందేహాలున్నాయి. రికార్డుల్లో చిన్నచిన్న పొరపాట్లు ఉన్నా ఉచిత గ్యాస్‌కు అర్హులవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటిని సరిచేసుకోవడానికి లబ్దిదారులు కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఇక ఆపార్ పేరుతో విద్యార్థుల నమోదు కొనసాగుతోంది. ఇందులో సాంకేతిక సమస్యలు నెలకొంటున్నాయి. వాటన్నింటినీ సరిచేసి ఎవరికీ ఇబ్బంది లేకుండా చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇందులో ఏ చిన్న తప్పు జరిగిన తల్లివందనం అందే పరిస్థితి లేదని చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు నెలకొంది. రైతులు ఏటా వచ్చే రైతు పెట్టుబడి సాయం కోసమూ ఎదురు చూస్తున్నారు. ఎప్పుడూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఇచ్చేవారు. కాని ఇప్పుడు ప్రభుత్వం మారిన నేపథ్యంలో రబీ వచ్చినా రైతుకు పెట్టుబడి సాయం అందకపోవడంతో దాని కోసమూ ఎదురు చూస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సాగునీటికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి-'ప్రజాపోరు'లో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య విమర్శించారు. సిపిఎం చేపట్టిన ప్రజాపోరులో భాగంగా శనివారం మండల పరిధిలోని తరిమెలలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయన్నారు. అలాగే ధరల పెరుగుదలలో అదుపు లేకుండా పోతోందన్నారు. ముఖ్యంగా కరువు మండలాల్లో శింగనమల లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే సకాలంలో వర్షాలు కురవక జిల్లావ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయన్నారు. ఈనేపథ్యంలో జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని చెరువులకు నీరు నింపాలన్నారు. హెచ్చెల్సీ చివరి ఆయకట్టు వరకూ నీరు ఇవ్వాలన్నారు. మరువకొమ్మ వద్ద బ్రిడ్జి, బస్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలపెంపును ఉపసంహరించుకోవాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, బడ్జెట్‌లో సాగునీటికి రూ.7వేల కోట్ల నిధులు కేటాయించాలని, మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు, అత్యాచారాలను నిరోధించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 14న నిరసన తెలపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజనేయులు, సుంకన్న, శ్రీనివాసులు, కొండారెడ్డి, సూర్యప్రకాష్, వెంకటస్వామి, ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, లక్ష్మీనారాయణ, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని గౌడ లేఅవుట్‌లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం గౌడ లేఔట్‌లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ లేఔట్‌లో ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. మురికి కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మధు, తిమ్మరాజు, అంజి, హనుమంతు, రమేష్, ఉమేష్, నగేష్‌నాయక్, మారన్న, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రజాపోరు యాత్రలో భాగంగా శనివారం మండలంలోని కడవకల్లు గ్రామంలో సిపిఎం నాయకులు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతూనే ఉన్నాయన్నారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14వతేదీన మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట, 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి.వెంకటగౌదరి, బి.భాస్కర్‌రెడ్డి, టి.పెద్దయ్య, నాగభూషణ్, ఎ.పెద్దయ్య, టి.ఆదినారాయణ, కుళ్లాయప్ప, గురుస్వామి, నారాయణస్వామి, నగేష్, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

గుంతకల్లు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నాయకులు చేపట్టిన ప్రజాపోరుబాట శనివారం రెండవ రోజుకు చేరింది. ఇందులో భాగంగా గుంతకల్లు పట్టణంలోని 26వ వార్డు సిబిఐ కాలనీలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు నాయకత్వంలో నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజాపోరుబాట కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బి.శ్రీనివాసులు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, పెంచిన విద్యుత్ ఛార్జీలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ తదితర సమస్యలపై సిపిఎం పోరుబాటకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల14న మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, అబ్దుల్లా, ఓబులేసు, రామునాయక్, ప్రసాద్, సి.రాము, బేల్దారి ఓబులేసు, కృష్ణ, శీన, పుల్లయ్య, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న భారాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. శనివారం గుత్తిలోని జెడ్.వీరారెడ్డి భవనంలో ప్రజాపోరు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలన్నారు. ఇసుకను ఉచితంగా ఇవ్వాలన్నారు. మద్యం దుకాణాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు. మల్లికార్జున, ఫిరోజ్, నాయక్, మద్దిలేటి, రేవతి, కవిత, మారి, రాము, శ్యామల, రంగమ్మ, రామలక్ష్మి, మల్లికా, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుయాత్ర శనివారం మండలంలో కొనసాగింది. ఇందులో భాగంగా సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎం.కుళ్లాయప్ప, మహిళా నాయకురాలు కుళ్లాయమ్మ, ఆంజనేయులు, కుళ్లాయమ్మ, బాలయ్య, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, వెంకటమ్మ, నాగవేణి, పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు.



శింగనమల మండలం తరిమెలలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు


రాయదుర్గం గౌడ లేఅవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

అభివృద్ధి దిశగా అడుగులు : ఎమ్మెల్యే కాలవ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని కళ్యాం, హులికళు, మల్లికేతి, కాదలూరు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు సిఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నాగేల్ల రాజు, ఎంపిటిసి గంగాధర్, మొండి మల్లికార్జున, ముకాసి వెంకటేశులు, వన్నూరుస్వామి, సర్పంచి దోనప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి ఎంపిటిసి

మండల పరిధిలోని మల్లికేతి ఎంపిటిసి గోవిందు టిడిపిలో చేరారు. ఈమేరకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆయనకు పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిలో నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నాగల్లి రాజు, సర్పంచి దోనప్ప, తదితరులు పాల్గొన్నారు.


ఎంపిటిసి గోవిందుకు కండువా కప్పుతున్న కాలవ శ్రీనివాసులు

గవర్నర్‌తో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ భేటీ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎపి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోయే ముందు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బడ్జెట్ రూపకల్పన, ప్రభుత్వ ప్రాధాన్యతలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గవర్నర్‌కు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


గవర్నర్‌తో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల

ఎస్.గూడూరులో నాకాబందీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని ఎస్.గూడూరు గ్రామంలో సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్ల ఇళ్లు, కళ్లందొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి గొడవలకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. అలాకాకుండా గొడవలకు వెళ్తే కేసులు నమోదు చేసి శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు ఎస్ఐ హేమాద్రి, యల్లనూరు ఎస్ఐ రాంప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.


గడ్డివామిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

హెచ్చెల్సీ పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని కుమ్మనమల నుంచి యల్లనూరు మండలం బొప్పేపల్లి చెరువుకు నీరు వెళ్లే హెచ్చెల్సీని ఆర్‌డిఓ కేశవనాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుట్లూరు, యల్లనూరు మండలాల్లో తాగు, సాగునీటి విషయంపై ప్రజలతో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు తహశీల్దార్ శేషారెడ్డి, మండల సర్వేయర్ శాంతి, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'అపార్' కష్టాలను తొలగించాలి

ప్రజాశక్తి-అనంతపురం


చంద్రశేఖర్‌యాదవ్

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కష్టాల నుంచి విద్యార్థులకు విముక్తి కల్పించాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపార్ నమోదుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోకుండా.. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకుండా కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదన్నారు. అపార్ నమోదుకు పాఠశాల రికార్డులు మార్పు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరమన్నారు. విద్యార్థులు సులభతరం అయ్యే విధంగా మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

బొమ్మనహాల్ : మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ జెఇ జగదీష్, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ కొత్తపల్లి మల్లికార్జున శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు రూ.3.5కోట్లతో సీసీ రోడ్ల పనులు చేపట్టినట్టు తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ జెఇ, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే సురేంద్రబాబు సహకారంలో పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. రెజ్లింగ్ అసోసియేషన్ నిర్వహిస్తున్న పోటీల్లో 13 జిల్లాల నుంచి దాదాపు 250 మంది రెజ్లర్స్ పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గుత్తి

న్యాయ సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాఆచారి అన్నారు. శనివారం పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో మండల న్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ లో రాజీమార్గంగా వీలైనంత కేసులను పరిష్కరించాలన్నారు. డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలని న్యాయవాదులకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయస్థానాల సూపరింటెండెంట్లు నరసింహారెడ్డి, మునెమ్మ, గీతా వరలక్ష్మి, ఎపిపి భూసా సుధీర్‌రెడ్డి, ఎజిపి వి.తిమ్మారెడ్డి, గుత్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రామశర్మ, ఉపాధ్యక్షులు పిడి.రత్నం, కార్యదర్శి నగదాని చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాదులు ఆర్ వి. చలపతి, కె.మనోహర్ బాబు, ధనుంజయ, ఎంవి.మహేష్, పక్రుబాషా, జి.వెంకటేష్, జయరామిరెడ్డి, జి.విజయభాస్కర్, ఇస్మాయిల్, ఎం.పరమేశ్వర్‌రెడ్డి, మహమ్మద్‌రసూల్, విసి.గంగాధర్‌కుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న జడ్జిలు

సిపిఎం మండల కార్యదర్శిగా కుళ్లాయప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండల కార్యదర్శిగా ఆర్.కుళ్లాయప్పను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శితోపాటు 15మంది సభ్యులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడితోపాటు సభ్యులుగా వి.శివారెడ్డి, డి.శ్రీనివాసులు, పి.పుల్లయ్య, పి.నాగరాజు, పి.చంటి, సి.నాగేంద్ర, కె.నెట్టికంటయ్య, టి.సంజీవరెడ్డి, వై.చెన్నప్ప, వై.నడిపక్క, ఎం.వెంకటలక్ష్మి, పి.వెంకట్ కొండ, మరో ఇద్దరిని ఎన్నుకున్నారు. ఆహ్వానితులుగా బి.హరికృష్ణ, ఎన్.వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో రైతులు, కూలీలు, కార్మికులు, పేదల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు.


నూతనంగా ఎన్నికైన సిపిఎం మండల కమిటీ నాయకులు

జాతీయ న్యాయ సేవాదినోత్సవం

అనంతపురం : జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ నల్లప్ప, ప్యానల్ లాయర్లు, రిటైనర్ లాయర్లు, లేబర్ ఆఫీసర్, ఐసిసిడిఎస్ పీడీ, విజయనగర న్యాయ కళాశాల విద్యార్థులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

భూగర్భజలాలను పెంపొందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రైతుల శ్రేయస్సు కోసం భూగర్భజలాలను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆమిలినేని సురేంద్రబాబు తెలిపారు. శనివారం మండల పరిధిలోని గోళ్ల గ్రామంలో సర్పంచి కవిత ఆధ్వర్యంలో వాటర్ షెడ్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.కోట్ల నిధులతో గోళ్ల పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఫారంపాండ్లకు రూ.3 కోట్లు, రైతుల వ్యవసాయ పనిముట్లకు రూ.2కోట్లు, మహిళా సంఘాల జీవనోపాదులకు రూ.92లక్షల నిధుల కేటాయించినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు ఏమీ వర్తించకుండా నోట్లో మట్టి కొట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్థాంతరంగా ఆగిన పనులను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశులు, వాటర్‌షెడ్ ఛైర్మన్ బుజ్జన్న, రమేష్, మాజీ సర్పంచి రామ్మోహన్, లింగన్న, లండన్ వెంకటేశులు, రమేష్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.


వాటర్‌షెడ్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

డాబాలు, రెస్టారెంట్లలో మద్యపానం నిషేధం

నిర్వాహకులకు పోలీసుల ఆదేశాలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

డాబాలు, రెస్టారెంట్లలో మద్యపాన నిషేధమని, ఎవరైనా మద్యపానాన్ని అనుమతించినా, రహస్యంగా విక్రయాలు సాగించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. జిల్లాలోని డాబాలు, రెస్టారెంట్ల యజమానులతో ఆయా డీఎస్పీలు, సిఐ శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాబాలు, రెస్టారెంట్లలో ఎవరూ మద్యం తాగరాదన్నారు. మద్యపానాన్ని అనుమతించినా, రహస్యంగా మద్యం అక్రమంగా విక్రయించినా చర్యలు తప్పవన్నారు. అంతేగాకుండా డాబాలు, రెస్టారెంట్లు నిర్వాహకులు పరిసరాలు స్పష్టంగా కన్పించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డాబాలు, రెస్టారెంట్లలో దందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడినా, ఇందుకు అనుమతించినా, ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగిన మత్తులో కొందరు నేరాలకు ఒడిగట్టడం మహిళా ప్రయాణీకుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ఈవ్ టీజింగ్ పాల్పడటం వీలున్నందున ఎట్టి పరిస్థితులలో డాబాలు, రెస్టారెంట్లలో మద్యపానానికి అనుమతి ఉండకూడదన్నారు. డాబాలు, రెస్టారెంట్లలో మైనర్ బాలులతో పని చేయించడం, పనిలో ఉంచుకోవడం చట్ట విరుద్ధం, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

తాడిపత్రి రూరల్ : డాబాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామకృష్ణుడు హెచ్చరించారు. శనివారం తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో డాబా యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దాబాల్లో మద్యం తాగేందుకు అనుమతించకూడదన్నారు. ఈమేరకు దాబాల్లో సూచిక బ్యానర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ శివగంగాధర్ రెడ్డి, పట్టణ సీఐ సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


దాబాలు నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నందకిషోర్

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో ఎంపిడిఒ నందకిషోర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిసి ఎపిఒ రాజ్యలక్ష్మి, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పెంచిన విద్యుత్ ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈక సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను పెంచమని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రూఆప్ పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజలపై రూ.6,073 కోట్ల భారాన్ని మోపిందన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని సామాన్యులపై విద్యుత్ భారాలు పోపడం మంచిది కాదన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపును విరమించుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, చల్లపల్లి వీరయ్యచౌదరి, ఫక్రుద్దీన్‌సాబ్, కంబదూరు మండల కన్వీనర్ ఈరన్న, మధుసూదన్, కళ్యాణదుర్గం మండల కన్వీనర్ బోయ నాగరాజు, మైనారిటీ నాయకుడు కాంగ్రెస్ దాదా, మాల ఈశ్వర్‌ప్రసాద్, కళ్యాణదుర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఉద్దీప్‌సింహా, గఫార్‌సాబ్, గణేష్, ఎస్సీ కాలనీ రవి, కర్తనపర్తి రాంపురం నారాయణ, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఉరవకొండలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉరవకొండ : ప్రజలపై విద్యుత్ భారాన్ని వెంటనే కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఉరవకొండ మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ధరల పెరుగుదల, ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ భారం మోపడం అమానుషమన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియా సీనా, అబ్బాస్, ప్రసాద్, ముక్కన్న, చంద్రశేఖర్, ఎర్రిస్వామి, గణేష్‌నాయక్, రమేష్, వెంకటేశులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ ఉద్యోగుల పరిష్కారమే లక్ష్యమని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు జి.ఆస్కారరావు, శ్రీకాంత్‌రాజు తెలిపారు. శనివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉద్యోగులకు వ్యతిరేకంగా పని చేసే ఇద్దరిని సంఘం నుంచి తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ విభాగాలు, స్థాయిల్లో పని చేస్తున్న ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పాత సంఘాల మాదిరి మూసధోరణిలో కాకుండా వినూత్నమైన పద్ధతిలో ప్రశ్నించే ధోరణితో పని చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పాటిల్ విజయభాస్కరరెడ్డి, జూపల్లి రమణకుమార్, కోశాధికారిగా సి.లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా కె.వెంకటేసులు, ఎ.గోవిందు, జె.చంద్రకాంత్‌రావు, ఎం.జయరామిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా బాబు, పి.సమీర్‌ఖాన్, పి.గిరిధర్, సుధాకర్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా శ్రీనివాస్, బాబానూరుద్దీన్, అనంతపురం నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా బి.పెద్దన్న, జిలాన్‌బాషా, ఉపాధ్యక్షులుగా పార్థసారథి, సి.వెంకటనారాయణ, అంజి, రాజునాయక్, సహాయ కార్యదర్శులుగా ఎం.రామాంజనేయులు, ఓబులపతిని ఎన్నుకున్నారు.


నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

గర్భిణులకు వైద్యపరీక్షలు

యాడికి : పిఎం ఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అప్పయ్య ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా బిపి, హెచ్‌బి వంటి పరీక్షలు నిర్వహించి బరువు, గర్భస్థపిండం కదలికలను పరిశీలించారు. వీరిలో 8 మందిని ఉచిత స్కానింగ్‌కు ఎంపిక చేశారు. అనంతరం గర్భిణులకు వై.రంజిత్‌కుమార్ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సంరక్షకుడు షబ్బీర్, పిహెచ్ఎన్ సుమతి, ఎంపిహెచ్ఎస్ సరోజమ్మ, సాయిలత, అనూషా పాల్గొన్నారు.

'గేట్స్' అధ్యాపకునికి డాక్టరేట్

గుత్తి : పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎంబిఎ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె.మొహమ్మద్ ఇమ్రాన్‌కు డాక్టరేట్ (పిహెచ్‌డి) దక్కింది. ఆయన 'స్టాక్ మార్కెట్ కార్పొరేట్ యాక్షన్' అనే అంశంపై పరిశోధించి డివిడెంట్ బోనస్ ఇష్యూ, షేర్ల బైబ్యాక్ ప్రభావం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోని కొన్ని కంపెనీలకు సంబంధించిన షేర్ ధరలపై ప్రభావం అనే అంశాన్ని అధ్యయనం చేసి పరిశోధనా పత్రాన్ని అనంతపురంలోని జెఎన్‌టియుకు సమర్పించారు. దీంతో మొహమ్మద్ ఇమ్రాన్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టరేట్ దక్కిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్ సన్మానించారు.

నేరాలు ఘోరాలు

గుత్తి ఎస్‌బిఐ కాలనీలో చోరీ

గుత్తి : పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన నాగిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం ఊరు వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని దుండగులు తలుపులు తాళాలు తొలగించి లోనికి ప్రవేశించి బీరువాను బద్దలు కొట్టి అందులో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, వెండి చెంబులు, కంచాలు తోపాటు వస్తువులను దోచుకువెళ్లారు. శనివారం తమ ఇంటికి వచ్చిన వారికి తలుపులు తెరిచి ఉండడంతో లోనికి వెళ్లారు. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

గార్లదిన్నె : అనంతపురం, కర్నూలు, సత్యసాయి జిల్లాల్లోని వివిధ గ్రామాల నుంచి ద్విచక్ర వాహనాలు దొంగలిస్తున్న దొంగను అరెస్టు చేసినట్లు డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ కౌలుట్లయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చోరీ కేసులో గార్లదిన్నె మండలం సంజీవపురం గ్రామానికి చెందిన శంకర్, సాయికుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బంది ఫిరోజ్ ఖాన్, చిరంజీవి, మునీంద్రను డీఎస్పీతోపాటు ఎస్పీ అభినందించారు.

లారీలు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

శింగనమల : మండల పరిధిలోని నాయనపల్లి క్రాసింగ్‌లో శనివారం రెండు లారీలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో దాదాపు గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలోనే ఇటీవల జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రెండు లారీలు ఢీకొనడంతో స్థానికులు, పోలీసులు ఖంగారు పడినా ప్రమాదం ఏమీ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిషన్ ఇన్‌ఛార్జిగా గోపాల్



ఉరవకొండ : ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిషన్ రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జిగా నింబగల్లు గోపాల్ నియమితులయ్యారు. ఈమేరకు దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ మామిడి సుదర్శన్ నుంచి గోపాల్ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు మామిడి సుదర్శన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణకు మాదిగ బిడ్డలతోపాటు మేధావులు, ఉద్యోగులు, యువకులు, దళిత నాయకులు, సామాజిక కార్యకర్తలను కలుపుకుని పోరాటాలు చేస్తానని తెలిపారు.

మెప్మా అధికారిని నియమించాలి

పామిడి : టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ అధికారిని నియమించి ఇబ్బందులు లేకుండా చూడాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో ఉన్న మహిళా సంఘాల సభ్యులు కోరారు. శనివారం పట్టణంలోని మెప్మాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో 35ఏళ్ల నుంచి ఇప్పటి వరకూ 485 సంఘాలు ఏర్పాటైనట్లు తెలిపారు. నాయా సంఘాల్లో 4892 మంది సభ్యులు ఉన్నామన్నారు. ఈనేపథ్యంలో పొదుపు చేసుకున్న మొత్తంలో సంఘం సభ్యులు డబ్బులు డ్రా చేయడానికి వెళ్తే మెప్మా అధికారి సంతకం లేనిది బ్యాంకు అధికారులు చెబుతున్నారన్నారు. కావున మెప్మా అధికారిని నియమించాలని కోరారు.

మలేరియా, డెంగీపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మలేరియా, డెంగీ వ్యాధులపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొట్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాల్లో అబేట్ స్ప్రే చేయడం, నీటి తొట్టెలను ఎండబెట్టుకోవడం చేయాలన్నారు. తర్వాత ర్యాపిడ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం జీనత్, ఎంఎల్‌హెచ్‌పి భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్త శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పంటల పరిశీలన

యాడికి : మండల పరిధిలోని నిట్టూరు, కొత్తపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పప్పుశనగ పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్‌బాషా శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పంటకు ఎండు తెగులు సోకినట్లు గమనించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా నివారణ కోసం ప్రోపికొనసోల్ లేదా టాబికొనజోల్ లీటరు నీటిలో 2 మిలీ కలుపుకుని పిచికారీ చేస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టే అవకాశం ఉందన్నారు. తర్వాత ఎండు తెగులు నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి రమేష్, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు అందజేత



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీలర్ వసూద్‌వలి

శింగనమల : మండల కేంద్రంలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడి ఇంటికే వెళ్లి నిత్యావసర సరుకులు అందజేసి డీలర్ మసూద్‌వలి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా మసూద్‌వలి మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు నడవలేని వృద్ధులకు ఇళ్లకే వెళ్లి నిత్యావసర సరుకులు అందజేయాలని సూచించారన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు మండల కేంద్రంలో నడవలేని స్థితిలో మంచం మీదే ఉన్న వృద్ధురాలు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ బియ్యం, సరుకులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్.శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

20వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే సురేంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గం వ్యాప్తంగా 20వేల మందికి ఉద్యోగాల కల్పనే తన లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు సహకరించిన ఎమ్మెల్యేను టెట్ అభ్యర్థులు శనివారం పట్టణంలోని ప్రజావేదికలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన కళ్యాణదుర్గం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగానే జిల్లా ఎమ్మెల్యేలు అందరం కలిసి జిల్లాలో డీఎస్సీ పోస్టులు పెంచాలని మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవిస్తున్నామన్నారు. అయితే వైసిపి అధినేత జగన్ ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా నీచ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా జగన్ అనవసర విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్‌చౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వైపి రమేష్, గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 169 దరఖాస్తులు

రాయదుర్గం : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం తొలిరోజు నియోజకవర్గంలో 169 దరఖాస్తులు వచ్చినట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని బిఎన్.హళ్లి, 74-ఉడేగోళం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు తీరును బిఎల్ఒను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఓటరు నమోదు చేర్పులకు 102, తొలగింపులపై 27, సవరణలకు 31, ఓటరు కేంద్రం మార్పుపై 9 దరఖాస్తులు వచ్చినట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ తెలిపారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు సన్మానం

యాడికి : మండల రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజ్‌కుమార్ గుంతకల్లు డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్వోలు రమేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

పూజారి చిత్తప్ప మృతికి నివాళి

బ్రహ్మసముద్రం : టిడిపి సీనియర్ నాయకుడు చిత్తప్ప (67) మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో చిత్తప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో చౌలం మల్లికార్జునచౌదరి, మాజీ మండల కన్వీనర్లు రాజశేఖర్‌గౌడ్, వెంకటేశులు, రాయల మంజునాథ్‌చౌదరి, మండల టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, బిటిపి ఆయకట్టు మాజీ ఛైర్మన్ సుభాన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, మాజీ సర్పంచులు తిమ్మప్ప, చిత్తప్ప, నాగిరెడ్డిపల్లి సర్పంచి సందీప్, మండల నాయకులు పాలబండ సురేంద్ర, సురేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోవిందు, గుడిపల్లి సీనియర్ నాయకులు మల్లికార్జున, యువకులు మారుతి, మోహన్, వెంకటేశులు, ఆంజనేయులు, జనసేన తిమ్మరాజు, తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి : ఆర్‌డిఒ

కళ్యాణదుర్గం : ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ వసంతకుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఇందులో భాగంగా ఫారం-6, ఫారం-7, ఫారం-4, ఫారం-8కు సంబంధించిన దరఖాస్తులు ఎన్ని వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు 17ఏళ్లు పూర్తయిన యువతి, యువకులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

టిసి.వరుణ్‌కు అభినందనలు

శింగనమల : అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) ఛైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌ను ఆపార్టీ శింగనమల మండల అధ్యక్షులు తోట ఓబులేసు అభినందించారు. ఈ సందర్భంగా వరుణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకులు తోట రామమోహన్ పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం



ఎస్ఐను సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్రకుమార్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల వికలాంగుల సమైక్య నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఎస్ఐకు బొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీబాలాజీ వికలాంగుల మండల సమాఖ్య ప్రెసిడెంట్ హనుమంతు, గౌరవాధ్యక్షులు నరసింహులు, సెక్రటరీ చిత్తయ్య, ట్రెజరర్ వన్నూర్‌స్వామి, మాజీ సమాఖ్య ప్రెసిడెంట్ చనమల్లప్ప, ఇసి సభ్యులు సుధాకర్, సురేష్, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



విద్యార్థులను బయటకు పంపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న పట్టణంలోని శ్రీ వివేకానంద ప్రయివేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వివేకానంద పాఠశాలలో రెండో శనివారం విద్యార్థులకు సెలవు ఇవ్వకుండా స్టడీ అవర్స్ పేరుతో క్లాస్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లి తరగతులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ వివేకనంద పాఠశాల రెండో శనివారం సెలవు ఇవ్వకుండా క్లాసులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసికంగా ఆందోళన చెందుతున్నారన్నారు. విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న వివేకానంద పాఠశాలపై గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి హిరణ్య, నాయకులు వినయ్, సాయికుమార్, శివ, ఆది, తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడికి అన్యాయం చేస్తే సహించం

ప్రజాశక్తి-గుంతకల్లు

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం హలహర్వి మండలం గూళ్యం గ్రామంలో బీసిల చేతిలో దాడికి గురైన దళిత యువకుడు ఉమేష్‌కు పోలీసులు అన్యాయం చేస్తే సహించమని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని తిలక్‌నగర్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్యాలయంలో నిర్వహించిన దళిత సంఘాల నాయకుల సమావేశంలో ఎస్సీ, ఎస్టీ రక్షణ సమితి అధ్యక్షులు ఎం.మహేంద్ర, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కోకన్వీనర్ వై.భీమలింగ, న్యాయవాది కోరి చంద్రశేఖర్ మాట్లాడుతూ గూళ్యం గ్రామంలో బీసీ కులస్తుల చేతిలో దాడికి గురైన దళిత యువకుడు ఉమేష్‌పై పోలీసులు కౌంటర్ కేసును నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడితే పోలీసులు నిర్లక్ష్యం చేయడానికి అతనిపై రేప్ కేసు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. బాధితుడిపై కేసును ఎత్తివేసేంత వరకూ హాలహర్వి పోలీస్‌స్టేషన్ ముందు అన్ని దళిత సంఘాలను కలుపుకుని రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు నరసన్న, వై.ఎర్రిస్వామి, బి.సంపత్‌కుమార్, రామచంద్ర, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

లింగభేదం చూపితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆడ, మగ పిల్లలు అంటూ లింగ భేదం చూపితే చర్యలు తప్పవని డాక్టర్ పావని హెచ్చరించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'భేటీ పడావో..భేటీ బచావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. తద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇకపోతే ఆడ, మగ పిల్లల మధ్య వ్యత్యాసం చూపరాదన్నారు. ఇద్దరినీ సమానంగా చూడాలన్నారు. కొంతమంది మగ పిల్లలపై వ్యామోహంతో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని కడుపులో ఉన్నది ఆడపిల్లని నిర్ధారణ అయితే అబార్షన్లకు పాల్పడుతున్నారన్నారు. అలా చేస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. అనంతరం స్టాఫ్‌నర్స్ సునీత భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, స్టాఫ్‌నర్సులు సునీత, జీనాతున్నీసా, ఫార్మసీ ఆఫీసర్ మంగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ రాణి, సిహెచ్ఓలు భవాని, భారతి, నాగసురేఖ, హెబ్సిబా, హిమబిందు, ఏఎన్ఎంలు పద్మావతి, కోమల, చాముండేశ్వరి, అనూషా, హేమలత, లలిత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు రూ.40 లక్షలు మంజూరు



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బొమ్మనహాళ్

మండల పరిధిలోని కళ్లదేవనపల్లి గ్రామం నుంచి ఉరవకొండకు వెళ్లే రహదారిని నిర్మాణానికి ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసినట్లు టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం కోతకు గురైన రోడ్డును టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కురిసిన భారీ వర్షాలకు రహదారి భారీగా కోతకు గురైన విషయం తెలిసిందే అన్నారు. అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం రూ.1.20కోట్లు ఖర్చు చేసి కేవలం పైపులు వేసి గ్రావెల్ వేసి తాత్కాలిక మరమ్మతులు చేసిందన్నారు. అయితే వర్షాలకు తిరిగి కోతకు గురైందన్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లికార్జున, సల్లాపురం బాబు, గోనేహాల్ కేశవరెడ్డి, పయ్యావుల మోహన్, నవీన్, కించప్ప, డీలర్ ఖాసింసాబ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.